క్లుప్తంగా

అదనపు గదుల నిర్మాణానికి స్థల పరిశీలన



కళాశాల ఆవరణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు గదులు, ఆడిటోరియం నిర్మాణానికి ఆదివారం ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ఇంటర్మీడియేట్‌బోర్డు రూ.కోటి మంజూరు చేసిందన్నారు. నిర్మాణ పనుల విషయంలో ఎమ్మెల్యే తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కళింగకృష్ణకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పరమేశ్వర్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



హైమాస్ట్ లైట్లను పారంభిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ర్యాకల్‌లో గ్రామపంచాయతీ నిధులతో (రూ.5లక్షలు) ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, సర్పంచ్ పట్లోళ్ల సుజాతతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



ఫారూక్‌హుస్సేన్‌కు వినతిపత్రం అందిస్తున్న చంద్రశేఖర్

నారాయణఖేడ్: పదోన్నతులు కల్పించాలని కోరుతూ హిందీ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఆదివారం ఎమ్మెల్సీ ఫారూక్‌హుస్సేన్‌కు వినపతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతులు, ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని హామీనిచ్చినట్టు చంద్రశేఖర్ పేర్కొన్నారు. భాషతోనే భావవ్యక్తీకరణ సాధ్యమవుతుందని చదువులకు మూలాధారం భాషేనని చెప్పారు. ఇప్పటికైనా భాషా పండితుల సమస్యలు పరిష్కరించాలని వినతి ప్రతంలో ఆయన కోరారు.

భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన



శాంతినగర్‌లో నిర్వహించిన నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం నగర సంకీర్తన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6 గంటలకు హనుమాన్ నగర్ నుంచి ప్రారంభమైంది. పట్టణంలోని భక్తులు హనుమాన్ మందిరంకు చేరుకుని భజనలు, కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భగవంతుడిని స్మరించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. గత కొన్ని నెలల నుంచి కొనసాగుతున్న నగర సంకీర్తనకు విశేష స్పందన వస్తుంది.

శివ స్వాములకు స్వాగతం

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండల శివ స్వాములకు భక్తులు ఘన స్వాగతం పలికారు. హత్నూర నుంచి 11 రోజుల క్రితం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి మహా పాదయాత్రగా తరలి వెళ్లిన శివ స్వాములు శనివారం పాదయాత్రను పూర్తి చేసుకుని ఆదివారం హత్నూర మండలానికి శివస్వాములు చేరుకున్నారు. దౌల్తాబాద్, హత్నూరలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆంజనేయులు గురు స్వామి మాట్లాడుతూ 41 రోజులపాటు శివ దీక్ష తీసుకొని అత్యంత భక్తి శ్రద్ధలతో పరమశివుడిని ప్రార్థించామన్నారు.

నేడు రామలింగేశ్వర ఆలయంలో పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): నందికంది గ్రామంలో అతిపురాతనమైన రామలింగేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటింటికీ భగీరథ నీరు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



మహిళకు మంచినీటి బిందెను అందిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో ఇంటింటికీ భగీరథ నీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బీరంగూడ శ్రీ మల్లికార్జున హిల్స్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందించాలని సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథను ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రేపటి భావిభారత పౌరులుగా ఎదగాలని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని శిశు విహార్ హైస్కూల్ కర్ధనూర్ బ్రాంచ్ ఫెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ అండ్ కరస్పాండెంట్ అనిల్, డైరెక్టర్ బీనాలు ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడూతూ...నేటి సమాజంలో ఫోన్‌ల వాడకం విపరీతంగా పెరిగిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. అపరిచిత వ్యక్తుల మెసేజ్‌లు ఫార్వర్డ్ చేయడం, ఓటీపీలు చెప్పడం వంటివి ఎట్టి పరిస్థితుల్లో చేయొదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గాంధీ

జిన్నారం(పటాన్‌చెరు): ప్రపంచానికి ఆదర్శప్రాయుడు మహాత్మా గాంధీ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...సత్యం, అహింస మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహోన్నత నాయకుడు మహాత్మ గాంధీ అని కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. నేటి తరాలకు మహాత్మా గాంధీ చరిత్ర స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్ గౌడ్, గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

జోగిపేట(అందోల్): గడి పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–06 ఎస్‌ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం జోగిపేట పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి గురువులు నర్సింలు, వెంకయ్య, రమేష్, నాగభూషణం, సుధాకర్, ప్రభు, మోహన్ దాస్, యాదగిరి, లలిత, చంద్రకళ, శేఖా గౌడ్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గురువులకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. వారి ఆశీస్సులు పొందారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాస్ రెడ్డి, రమేష్, లలిత, లక్ష్మి, ప్రవీణ, సుమలత, సిద్ధేశ్వర్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిన నాయకులు



సంజీవరెడ్డితో సభకు తరలుతున్న నాయకులు

నారాయణఖేడ్: బిజినేపల్లిలో ఆదివారం నిర్వహించిన దళితగిరిజన ఆత్మగౌరవసభలో పాల్గొనేందుకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా.సంజీవరెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్ళారు. దళితుల, గిరిజనుల పట్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్య దోరణి ప్రదర్శిస్తోందని ఈ సందర్భంగా సంజీవరెడ్డి విమర్శించారు. సభకు తరలివెళ్లిన వారిలో నారాయణజాదవ్, కిషన్‌నాయక్, రాంచందర్‌నాయక్, కాశయ్య, శ్రీనివాస్, గిరిధర్‌నాయక్ ఉన్నారు. ఉట్‌పల్లికి చెందిన మనూరు పీఏసీఎస్ డైరెక్టర్ శివారెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారనే విషయం తెలుసుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు.

‘ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం’

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధ్యాయులపై డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన చేసిన వివాదస్పదా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్ పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని ఎస్‌టీయూటీఎస్ సంఘం భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్నాకు వచ్చే ప్రతి ఉపాధ్యాయులు సెలవు పెట్టి వస్తారని, ఈ విషయంలో ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడం బాధాకరమన్నారు. ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయుల వివరాలు కనుక్కోమని డీఈవోలకు ఆదేశాలు జారీ చేయడం ఆమె నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సంగారెడ్డి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరసింహారాజు, ఖయ్యూం, లక్ష్మయ్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **6గురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు**

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆరుగురికి కోవిడ్ టెస్టులు నిర్వహించారు. ఈ పరీక్షల్లో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్య సిబ్బంది మనోహర్ తెలిపారు.

◆ **నేడు సామూహిక కుంకుమార్చన**

నారాయణఖేడ్: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం 9:30 గంటలకు ఖేడ్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తారని ఆర్యవైశ్య సంఘం బాధ్యులు తెలిపారు. అనంతరం ఆలయంలో మహాహారతి, మహాప్రసాద వితరణ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు డ్రెస్‌కోడ్, అమ్మవారి విగ్రహం, పూజామండపంగుడ్డ, పూజా సామాగ్రితో నిర్ణీత సమయానికి హాజరవ్వాలని ఆయన కోరారు.

◆ **డ్రైవర్ల నూతన కార్యవర్గం ఎన్నిక**

సంగారెడ్డి టౌన్ : పట్టణంలో డీసీఎమ్, లైట్ మోటార్ వాహనాల డ్రైవర్ల యూనియన్‌ను ఆదివారం ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు మోమద్ పేర్కొన్నారు. ఉపాధక్షుడిగా షైయుంను ఎన్నికైన నట్టు ఆయన చెప్పారు. డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

◆ **నేడు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు రాక**

పటాన్‌చెరు టౌన్: ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ రాజ్యసభ, పార్లమెంట్ బోర్డ్ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ విచ్చేస్తున్నారని అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో పట్టణంలోని గోకులునగర్ వేదికగా బీజేపీలో యువకులు చేరనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ **అంబేడ్కర్ విగ్రహావిష్కరణ**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆత్మకూర్ గ్రామంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ప్రముఖ కళాకారుడు, వైస్సార్‌టీపీ నాయకులు ఏపూరి సోమన్న ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇందూరి గంగన్న, ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, పాల్గొన్నారు.

మార్చి 5న మల్లన్న జాతర



పూజకు హాజరైన కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో మార్చి 5న మల్లన్న జాతర నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆలయాన్ని ఆమె సందర్శించారు. అనంతరం ఆలయ నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుమ సంఘం పెద్దలతో మాట్లాడి జాతర తేదీని ప్రకటించినట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కరికే యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఒగ్గు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



సిద్ధాపూర్‌లోని శ్రీ మహాలింగేశ్వర మందిరం దృశ్యం

సదాశివపేట(సంగారెడ్డి): సిద్ధాపూర్ గ్రామ పరిధిలోని శ్రీ మహాలింగేశ్వర మందిరంలో 23న సోమవారం శ్రీ పార్వతిపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారని సిద్ధాపూర్ గ్రామస్తులు తెలిపారు. సోమవారం సుప్రభాత సేవ, గో ఆరాధన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ఆలయ ప్రోక్షణ, భక్తులతో శ్రీ పార్వతి పరమేశ్వర కల్యాణం నిర్వ హించడానికి ఏర్పాట్లు చేశారు.

రేపు మార్కండేయ జయంతి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆలయంలో 24న శ్రీ మార్కండేయ జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహిస్తారని మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, తీర్థప్రసాదాల వితరణ ఉంటుందని వారు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారానికి చెందిన యువకులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖేడ్ క్యాంపు కార్యాలయంలో రాయిపల్లికి చెందిన అక్షయ్‌రెడ్డికి రూ.28,000లు, మొజాహిద్‌ఖాన్‌కు రూ.11,500లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఖేడ్, మనూరు మండలాల కోఆప్షన్ సభ్యులు నవాబ్, సలీంపటేల్, అబ్బెంద సర్పంచ్ సుదర్శన్‌రావు, అంజాగౌడ్ పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయ ఆవరణలో కల్లుగీతకార్మిక సంఘానికి సంబంధించిన కేలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంజాగౌడ్, కృష్ణాగౌడ్, రాంచందర్‌గౌడ్, నర్సింహ్మాగౌడ్‌లు ఎమ్మెల్యేను సన్మానించారు. ఖేడ్ ప్రాంతంలోని తెలుగు, హిందీ, ఉర్దూ బాషాపండితులు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. రవీందర్‌రావు, భూమయ్య, సాయిబాబా, విజయ్‌కుమార్ స్వామి, దేవదానం, రవీందర్ పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న రహీం, పండరి

నారాయణఖేడ్: స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అంబేద్కర్, పూలే సేవాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ రహీం, పండరి డిమాండ్ చేశారు. ఖేడ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద విద్యార్థులు స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్స్‌తోనే విద్యను కొనసాగిస్తున్నారని వారు పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా బకాయిలు పేరుకుపోవడంతో చదువులు మానుకునే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బ్రిడ్జి

- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



సైడ్‌వాల్ కూలిన చేర్యాల శివారులోని బ్రిడ్జి

కంది(సంగారెడ్డి): మండలంలోని ఇంద్రకరణ్, ఒడియఫ్ వెళ్లే దారిలోని బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. సుమారు వందేండ్ల క్రితం చేర్యాల శివారులో వాగుపై ఏర్పాటు చేసిన బ్రిడ్జి ప్రస్తుతం వాహనదారులకు ఆటంకిగా మారింది. అప్పట్లో దీన్ని నల్ల రాతితో పటిష్టంగా నిర్మించారు. కాలక్రమేణ ఈ దారిగుండా వెళ్లే వాహనాల రద్దీ పెరిగింది. దీంతో బ్రిడ్జి పాతబడటం, పైగా వెడల్పు తక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఈ దారిగుండా నిత్యం ఒడియఫ్, ఇంద్రకరణ్ ప్రజలతో పాటు అక్కడ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు అధిక సంఖ్యలో ఈ బ్రిడ్జి గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం బ్రిడ్జికి ఇరువైపుల సైడ్ వాల్ పడిపోయింది. ప్రమాదశలో చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

‘ఓటు గొప్పది’

డెప్యూటీ తహసీల్దార్ మధుకర్ రెడ్డి



మాట్లాడుతున్న డెప్యూటీ తహసీల్దార్ మధుకర్ రెడ్డి

జోగిపేట(అందోల్): ఓటు హక్కు గొప్పదని జోగిపేట ఉప తహసీల్దార్ మధుకర్ రెడ్డి అన్నారు. జనవరి 25న 13వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార శకటం జోగిపేటకు ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ముందు కళాకారులు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం మధుకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధంలా పనిచేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటును నిజాయితీగా వేయాలన్నారు. ‘నేను తప్పకుండా ఓటు వేస్తా’ అనే నినాదంతో కళాజాత ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రమేష్, మహేశ్వరి, ఉమా గౌరీ, జోగినాథ్, శ్రీనివాస్, ప్రభు, యాదగిరి పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ



కోహీర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

కోహీర్(జహీరాబాద్): ఖస్బా కూడలిలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ నాయకులు ముద్దెడి జనార్ధన్‌రెడ్డి, విగ్రహాన్ని జాతికి అంకితం చేశారు. అంతకుముందు కోహీర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామపెద్దలు విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన దాతలకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు ముద్దెడి జనార్ధన్‌రెడ్డి, ముద్దెడి సుభాష్‌రెడ్డి, గోవింద్‌రావు దేశ్‌పాండే, లింగాల సంగమేశ్వర్, చావిడి దశరత్ రెడ్డి, ఆడివయ్య, సంపత్‌కుమార్, బక్కన్న, బస్సప్ప తదితరులు పాల్గొన్నారు.

భవాని మాత మందిర నిర్మాణానికి సహకరిస్తా



భూమిపూజ నిర్వహిస్తున్న కౌన్సిలర్లు, భక్తులు

సదాశివపేట(సంగారెడ్డి): భవాని మాత మందిర నిర్మాణానికి సహకరిస్తామని కౌన్సిలర్లు పులమామిడిరాజు, సాతాని లలిత శ్రీశైలం పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గురునగర్ కాలనీలో భవాని మందిరం నిర్మాణానికి వారు భూమి పూజ నిర్వహించారు. వారు మాట్లాడుతూ భవాని మందిరం నిర్మాణానికి భక్తులు సహకరించాలని కోరారు. బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ వీరేశం, ఆలయ కమిటీ సభ్యులు నందంగౌడ్, నర్సింహారెడ్డి, శివారెడ్డి, ఈశ్వరప్పా, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఊరడమ్మ జాతర



మనియార్‌పల్లిలో ఊరడమ్మ ఆలయం

కోహీర్(జహీరాబాద్): మనియార్‌పల్లిలో శ్రీ ఊరడమ్మ జాతరను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి శ్రీపోచమ్మనాగులు, శ్రీభూలక్ష్మిదేవి అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తారు. సాయంత్రం 5.30 గంటల నుంచి అన్నదానం నిర్వహిస్తారు. మంగళవారం మధ్యాహ్నం ఊరడమ్మ అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.